క్లుప్తంగా

చదువే మనిషికి ఆస్తి

పాల్వంచరూరల్: సమాజంలో ప్రతీఒక్కరు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని చదువే మనిషికి ఆస్తి అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో దంత లబోరుకు చెందిన న్యాయవాది కాటూరి సంజీవరావు కుమార్తె బిందు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా సోమవారం ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. బిందును సత్కరించి మాట్లాడారు. యర్రంశెట్టి ముత్తయ్య, కె.వెంకన్న, శాంతివర్ధన్, వెంకటాచారి, శేఖర్, సోమయ్య పాల్గొన్నారు.

ఆందోళనకు సిద్ధం కండి..

సింగరేణి(కొత్తగూడెం): సెప్టెంబర్ 7న, హైదరాబాద్‌లో జరగనున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ షావలీ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆందోళన కార్యక్రమాలకు కార్మికవర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

జూలూరుపాడు: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని టీజీఎన్‌పీడీసీఎల్ కొత్తగూడెం డీఈ (ఆపరేషన్) జి.రంగస్వామి అన్నారు. సోమవారం సాయిరాంతండా గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. అక్రమంగా వ్యవసాయ మోటార్లు నడుపుతున్న రైతులు రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ ఎం.రవికుమార్, ఏఈ నరసింహారావు, సబ్ ఇంజనీర్ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీలో సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచరూరల్: వీరునాయక్ తండా సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అభిమన్యు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు నిర్మాణం చేయాలని, కళాశాలకు ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణం చేయాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. ఖాళీ అధ్యాపకుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వప్న, మౌనిక, సౌజన్య, సరిత, రాజేష్, మహేష్ పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలి

జూలూరుపాడు: అడవులు, వన్యప్రాణులను సంరక్షించాలని కొత్తగూడెం ఎఫ్‌డీఓ యు.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధి గుండెపుడి అటవీ బీట్‌లోని పోడు భూములు, ఊటకుంటలు, గుండెపుడి ప్లాంటేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూలూరుపాడు అటవీ నర్సరీని పరిశీలించి, మొక్కల సంరక్షణ, పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అటవీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

టేకులపల్లి: ఈనెల 16న సుజాతనగర్ మండలంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన టేకులపల్లి మండలం 9వ మైల్ తండా పంచాయతీ కోటల్ల గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఈసాల ప్రభాకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం ఏరియా కార్యదర్శి డి.ప్రసాద్, మండల కార్యదర్శి కానుగుల వెంకన్న కోరారు. ఈ మేరకు సోమవారం కోటల్ల గ్రామంలో దశదిన కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మెండు వినోద్, కొట్టెం వంశీ, ఎర్రయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: కొత్తతండా(పి) నుంచి తావుర్యాతండా వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఈ క్రమంలో 'ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ స్తంభం'అనే శీర్షికన సాక్షిలో సోమవారం వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన బొమ్మనపల్లి ఏఈ బుజ్జి కన్నయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టి స్తంభాన్ని సరిచేశారు.

నేడు సామాజిక తనిఖీ మహాసభ

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మండల మహాసభ మంగళవారం స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 2024 నుంచి ఏడాది ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం ప్రతినిధులు తనిఖీ చేసినట్లు చెప్పారు. వీటిపై మండల మహాసభలో చర్చించనున్నట్లు వివరించారు. కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

గణేష్ టెంపుల్‌లో సిబ్బంది కొరత

- ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, వాచ్‌మెన్, స్వీపర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీ
- పట్టించుకోని ఉన్నతాధికారులు


కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం

కొత్తగూడెంటౌన్: వరుస పండుగలు.. ఇటు భక్తుల రద్దీ.. ఉన్న అరకొర ఉద్యోగులతో పనిభారంతో ఇబ్బందులు పడుతున్నామని కొత్తగూడెం గణేష్ టెంపుల్ ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు. కొత్తగూడెం పేరుగాంచిన శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్)లో వేధిస్తున్న సిబ్బంది కొరత.. కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్ జిల్లాలోనే కాదు.. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు కూడా సుపరిచితమే. నిత్యం వందలాది మంది భక్తులు ఈ ఆలయానికి వచ్చి వినాయకుడికి పూజ చేస్తుంటారు. అదేవిధంగా ఇక్కడ ప్రతీ పండుగలకు, వ్రతాలు, హోమం, వంటి పూజలతో రద్దీగా ఉంటుంది. వినాయక చవితి నవరాత్రులు, అమ్మవారి శరన్నవరాత్రులు వంటివి కాకుండా భక్తి ప్రధానమైన అనేక వేదికలకు ఈ ఆలయం నిలయంగా ఉంది. ప్రతీరోజు వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కానీ ఇక్కడ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాలు నిర్వహించాలంటే మాత్రం కత్తిమీద సాములా మారిందని ఆలయ ఉద్యోగులు చెబుతున్నారు. సరిపడా ఉద్యోగులు, సిబ్బంది లేరని ఆలయ ఉద్యోగులు వాపోతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ప్రస్తుతం ఈఓ, ఒక ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్, స్వీపర్ మాత్రమే ఉన్నారు. అదేవిధంగా భక్తులకు పూజలు చేసేందుకు నలుగురు అర్చకులు ఉన్నారు. పూజలు, తీర్థాలు, భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలంటే ఆలయానికి సరిపడా సిబ్బంది ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ప్రస్తుతం వినాయక చవితికి నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించాలంటే సిబ్బంది కొరత వేధిస్తోందని ప్రతీరోజు పూజల కోసం వచ్చే భక్తులకు సేవలు అందించాలంటే మరికొంత మంది ఉద్యోగులు, సిబ్బంది అవసరమని వాపోతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి...

కొత్తగూడెం గణేష్ టెంపులో ఆరుగురు ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం ఉన్న గుమస్తాకు ఖమ్మం బదిలీ కావడంతో ఒకటి, రెండు రోజుల్లో వెళ్లనున్నారు. ఇప్పుడు ఆలయంలో ప్రస్తుతం ఆలయంలో ఒక ఈఓ, ఆఫీస్ సబార్డినేట్, ఒక స్వీపర్, ఒక నైట్ వాచ్‌మెన్ మాత్రమే ఉన్నారు. ఇంకా ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ రికార్డ్ అసిస్టెంట్, డే వాచ్‌మెన్, ఒక స్వీపర్ కావాల్సి ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించడం లేదని ఇప్పటికైనా స్పందించి గణేష్ టెంపుల్‌కు ఉద్యోగులు, సిబ్బందిని కేటాయించాలని కోరుతున్నారు.

నివేదిక పంపించాం..



శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్, స్వీపర్, వాచ్‌మెన్‌ల కొరత ఉంది. భక్తులు ఆలయానికి నిత్యం వస్తుండటంతో ఇబ్బంది కలగకుండా ఉన్న సిబ్బందితో చర్యలు తీసుకుంటున్నాం. ఉద్యోగులు, సిబ్బందిని కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.– ఎన్.రజనీకుమారి,ఈఓ, గణేష్ టెంపుల్ కొత్తగూడెం

మట్టి విగ్రహాలనే పూజించాలి


సింగరేణి(కొత్తగూడెం): మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న జీఎం శాలేంరాజు

ఇల్లెందు: సింగరేణి ఉన్నత పాఠశాలల విద్యార్థులు మట్టి విగ్రహాలనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. అంటూ 250 మట్టి విగ్రహాలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.శ్రీనివాసరావు, అకడమిక్ ఇన్‌చార్జ్ బి.శ్రీనివాస్, గ్రీన్‌కోర్ ఆర్గనైజర్ ధనలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, నరసమ్మ, రవీందర్, రాజుగౌడ్, మహేష్, పీటీ రాధ తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం ఎం.శాలేంరాజు సోమవారం మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు హుమాయిన్, ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణరాజు, ఏజీఎం ఫైనాన్స్ కే.సుమలత, ఏజీఎం సివిల్ రామకృష్ణ, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, డీజీఎం (ఐఈ) ఎస్.యోహాన్ పాల్గొన్నారు.

పెండింగ్ కమీషన్లు చెల్లించండి..

ఇల్లెందురూరల్: ఐదు నెలల రేషన్ కమీషన్‌ను వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని రేషన్ డీలర్లు సోమవారం తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు పోతు శబరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఒకే నెలలో మూడు నెలల రేషన్ బియ్యం ఉదయం నుంచి రాత్రి వరకు పంపిణీ చేశామని గుర్తుచేశారు. కానీ ఐదు నెలలుగా కమీషన్ చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా కాకుండా ఒకేసారి కమీషన్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగంపల్లి రవి, స్వరూప, పాశం శ్రీను, వెంకటమ్మ, సూర్నపాక సంపత్, లక్ష్మణ్‌రావు, వెంకటేష్, ఈసం భద్రయ్య పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల రేషన్ కమీషన్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రేషన్ షాపుల డీలర్లు సోమవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ దారా ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

సుజాతనగర్: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. ఎస్పీ బి.రోహిత్‌రాజు ఆదేశాలతో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ విద్యాసంస్థల పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలని చెప్పారు. విద్యా సంస్థలలో ర్యాగింగ్ చేయడం నేరం, తోటి విద్యార్థులను ఇబ్బంది పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, విద్యాసంస్థల నుంచి తొలగింపబడతారని తెలిపారు. ప్రతీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని, కొత్తగా చేరిన విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని యాజమాన్యానికి సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు గురైతే ఆ విషయాన్ని తక్షణమే కళాశాల యాజమాన్యానికి లేదా పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై ఎం.రమాదేవి, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

6న గణేష్ నిమజ్జనం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో గణేష్ నిమజ్జనాన్ని వచ్చే నెల 6న నిర్వహించనున్నట్లు గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తుండడంపై కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు కూడా మైక్ అనుమతి ఫీజు రద్దు చేయాలని కోరారు. కాగా కమిటీ సభ్యులు నిమజ్జనం రోజున విగ్రహాలతో సాయంత్రం 4గంటలకు ప్రకాశం స్టేడియానికి చేరుకోవాలన్నారు.

దశలవారీ ఆందోళనలు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.43 వేల కోట్లు చెల్లించాలని టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం ఏరియా రామవరంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల సాధనకు ఈనెల 28 నుంచి దశలవారీ ఆందోళనలో భాగంగా సెప్టెంబర్ 2న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నామని, ఈ ధర్నాలో సింగరేణి వ్యాపిత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రంగనాథ్ కథకు అవార్డు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి చెందిన సుదర్శనం రంగనాథ్ రచించిన 'మైలంటని మహాలక్ష్మి' కథకు అవార్డు లభించింది. రెండు రోజుల క్రితం ఖమ్మం బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సాహితీ పురస్కార సభలో ఆయనకు ఉరిమెళ్ల పౌండేషన్ వారు అవార్డు అందజేసి సత్కరించారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలోని క్వార్టర్లకు 41 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకోగా 12 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అర్హతను బట్టి క్వార్టర్లను కేటాయించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


కేక్ కట్ చేస్తున్న సీఐ శివకుమార్

కొత్తగూడెంఅర్బన్: యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని త్రీటౌన్ సీఐ కె.శివప్రసాద్ అన్నారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలోని పవర్ హౌస్ జిమ్ ఏర్పాటు చేసి 10 సంవత్సరాల సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఐ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ యువత తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ప్రతీరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ధృడంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో యర్రా కామేష్, వై.శివసుబ్రహ్మణ్యం, గోపికృష్ణ, మాలోత్ రాజా, ధారా నగేశ్, రవి, ధర్మేందర్, లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..


సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగుల, ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం టీఆర్‌వీకేఎస్ నాయకులు హనమకొండలోని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సీఎండీ త్వరలో సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గౌరవ అధ్యక్షుడు కోడూరు ప్రకాశ్, రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.జాన్సన్, ప్రధాన కార్యదర్శి రమేష్, అదనపు ప్రధాన కార్యదర్శి పి.గోపాల్‌రావు, ఎన్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభాకర్, ఎండీ.అబ్దుల్, అజీజ్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి రహీం పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు..

జూలూరుపాడు: గ్రామీణ వైద్యులు స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రం జూలూరుపాడులోని పలు ఆర్ఎంపీ క్లినిక్‌లను డాక్టర్ తేజశ్వనితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, సిరంజిలు, ప్రిస్క్రిప్షన్లు, ఇతర వస్తువులను పరిశీలించి వైద్య విధానంపై ఆరా తీశారు. మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ వైద్యులు బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటిబైటిక్స్, స్టెరాయిడ్లు, ఎసెప్టిక్ కండీషన్స్, ఇంజెక్షన్ ఫార్మ్స్, ఓరల్ హార్మోనల్ పిల్స్ వంటి మందులు ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. స్థాయికి మించి వైద్యం చేసి అమాయక ప్రజలతో ఆర్ఎంపీలు చెలగాటం ఆడుతున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీనివాస్, హెల్త్‌అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాల క్రీడలు ప్రారంభం


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ రవి

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమయ్యాయి. జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ఎస్ఐ బాదావత్ రవి, ఎంఈఓ బానోత్ జుంకీలాల్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని, శారీరక దృఢత్వానికి పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరిచి ఉన్నత శిఖరానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూలూరుపాడు, పాపకొల్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు లక్ష్మీనర్సయ్య, ఎస్కే మీరా సాహెబ్, పీడీలు అరుణకుమారి, యుగంధర్, పీఈటీలు నాగేశ్వరరావు, సావిత్రి పాల్గొన్నారు.

ఏరియా స్థాయి క్రీడలు నిర్వహించండి..


నాయకులతో చర్చిస్తున్న తుకారాం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదేశాల మేరకు డీజీఎం పర్సనల్ తుకారాం కార్మిక సంఘాల నేతలతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోఆర్డినేటర్, జనరల్ కెప్టెన్ నియామకం చేపట్టాల్సి ఉందన్నారు. గుర్తింపు సంఘం నుంచి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం నుంచి జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు క్రీడల పట్ల మక్కువ ఉన్న వారిని ప్రోత్సహించాలన్నారు. క్రీడా పోటీలలో సత్తా చాటి ఇల్లెందు ఏరియాకు పేరు, ప్రతిష్టలు తేవాలన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు..

ఇల్లెందురూరల్: వారం రోజుల్లో యూరియా సరిపడా వస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దని పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సీజన్ ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం నుంచి యూరియా అవసరం మేర సరఫరా కాలేదని, దీంతో ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. వచ్చిన యూరియాను మండలంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేసి పంపిణీ చేశామని వివరించారు. మండలంలో గతేడాది 47వేల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ ఏడాది 51వేల ఎకరాల్లో సాగైందని, పాసుపుస్తకాలు లేని రైతులు సుమారు ఐదు వేల ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తాం..


మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

కొత్తగూడెంఅర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని గాంధీపథం రాష్ట్ర కన్వీనర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కొత్తగూడెంలోని సూర్యా ప్యాలెస్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి గాంధీపథం నాయకులు, సభ్యుల కృషి ఎంతో ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గాంధీపథం నుంచి పోటీలో ఉంటామని చెప్పారు. జిల్లాకు సీతారామ ప్రాజెక్ట్ నుంచి అశ్వాపురం, బూర్గంపాడు, పాల్వంచ, కొత్తగూడెం, ఇతర మండలాల రైతులకు నీళ్లివ్వకుండా కుట్ర జరిగిందని, ఫలితంగా ఆయా ప్రాంత రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రాంత రైతులకు నీళ్లివ్వాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలోనూ అన్యాయం జరిగిందని అర్హులు ఆరోపిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చింతలచెరువు గెర్షోం, సూరెడ్డి సందారెడ్డి పాల్గొన్నారు.

యూరియా సమస్యను పరిష్కరించండి..


ఇల్లెందురూరల్: వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనా వైఫల్యం వల్లే యూరియా కొరత నెలకొందని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ ఆరోపించారు. రైతులు పడుతున్న ఇబ్బందులకు నిరసనగా వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, రైతులు సోమవారం ధర్నా చేశారు. హరిప్రియ మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు తెల్లవారక ముందే క్యూలైన్లో ఉంటున్నా కాంగ్రెస్ నేతల్లో చలనం లేదని విమర్శించారు. రైతు సమస్యలను విస్మరించి రాజకీయాలకే పరిమితమయ్యారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులు ధీమాగా వ్యవసాయం చేసుకున్నారని, విత్తనాలు, ఎరువుల కోసం ఎలాంటి ఇబ్బంది లేకుండా సీఎం కేసీఆర్ పాలన అందించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల అవసరాల మేరకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. దేవీలాల్‌నాయక్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, సిలివేరు సత్యనారాయణ, పర్చూరి వెంకటేశ్వరరావు, బాన్‌సింగ్, బండారు శ్రీనివాస్, పీకే శ్రీనివాస్, లష్కర్, మౌనిక పాల్గొన్నారు.

టేకులపల్లి: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని, యూరియా కొరతను నివారించాలని బీఆర్ఎస్ టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ అన్నపూర్ణకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. బోడ బాలు, చీమల సత్యనారాయణ, ఆమెడ రేణుక, కుమ్మరి కిరణ్, తేజావత్ రవి, లక్‌పతి, లచ్చు, అప్పారావు పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యను పరిష్కరించాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు – కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ వరి, మిర్చి, పత్తి తదితర పంటలకు యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కోరం వెంకటేశ్వర్లు, రాంసింగ్, పాపారావు, నెల్లూరి నాగేశ్వరరావు, ముక్తి నారాయణ పాల్గొన్నారు.

సుజాతనగర్: యూరియా కొరతను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు బత్తుల వీరయ్య, సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ ఆధ్వర్యంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సోమవారం సుజాతనగర్‌కు వచ్చిన కలెక్టర్‌కు కలిసిన నేతలు ఆయా సమస్యలపై వినతులు సమర్పించారు. రైతులకు సరిపడా యూరియా పంపిణీ కాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. సుజాతనగర్ మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్, బస్‌షెల్టర్ నిర్మించాలని, సింగభూపాలెం, గరీబ్‌పేట, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేయాలంటూ సీపీఎం నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. లావుడ్యా సత్యనారాయణ, పి.నరేంద్రప్రసాద్, కె.రాములమ్మ, కున్సోత్ ధర్మా పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలోని పడమటనర్సాపురం గ్రామంలో సోమవారం టీబీ అనుమానితులకు ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి టీబీ (క్షయవ్యాధి) ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులను గుర్తించేందుకు నిర్వహించిన క్యాంప్‌ను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

టీబీ వ్యాధి నిర్ధారణకు ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్ ఈనెల 30వ తేదీ వరకు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో కొనసాగనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఎక్స్ రే నిపుణులు సాయికృష్ణ, ఐసీటీసీ ఎల్‌టీ బి.రాహుల్, ఏఎన్ఎంలు తార, జీజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.